క్లుప్తంగా

దసరాకు డీజేలు నిషేధం

గూడూరు రూరల్ : దసరా పండుగ సందర్భంగా పట్టణంలో నిర్వహించే ఊరేగింపుల్లో డీజేలు పెట్ట కూడదని డీఎస్పీ వీవీ రమణకుమార్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ జెండా పండుగ సందర్భంగా ఊరేగింపుల్లో ఏర్పాటు చేసిన డీజేల వద్ద ఘర్షణల వల్ల పలువురు దాడులకు పాల్పడినట్టు తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే అమ్మవార్ల ఊరేగింపులో ఎక్క డా డీజేలు పెట్టవద్దని హెచ్చరించారు. పట్టణ సీఐ శేఖర్ బాబు, ఎస్ఐ సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని సాయిరాం వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు గురువారం వైజేపీ లయన్స్ క్లబ్ సభ్యులు అన్నదానం చేశారు. అనంతరం ఒక వృద్ధురాలికి వీల్ చైర్ అందజేశారు. ఈ కార్యక్రమాలను అంబటి రమణారెడ్డి, రమాదేవి దాతృత్వంతో చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సుబ్రమణ్యం, కార్యదర్శి పసుపులేటి ప్రసాద్, పద్మనాభరెడ్డి, రవీంద్రరెడ్డి, మురళీనాయుడు, ఎస్ఎల్ఎన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ నవీన

దొరవారిసత్రం : గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని తొగరాముడి పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్‌సాయి, డాక్టర్ నవీన తెలిపారు. వారు గురువారం మీజూరు, తల్లంపాడు గ్రామాల్లో 104 వాహన సేవలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసిమందులు అందజేశారు.

ఉచ్చూరు ఎఫ్ఏ మృతి



రామకృష్ణ(ఫైల్)

దొరవారిసత్రం : ఉచ్చూరు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మద్దూరు రామకృష్ణ(38) గురువారం మృతి చెందాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన అతన్ని గురువారం శ్రీకాళహస్తికి తరలిస్తుండగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో గోవర్ధన, ఏపీవో భాస్కరయ్య, ఈసీ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని అతని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

డక్కిలి: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో గురువారం చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతి వెంకటేశ్వర అరవింద్ ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. 120 మందికి పరీక్షలు చేసి 50 మందికి ఉచితంగా మందులు, 30 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ ఏవో కృష్ణ గల్లా తెలిపారు. 22 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

16 నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

సైదాపురం: ఈ నెల 16వ తేదీ నుంచి జిల్లాలోని మూగజీవాలకు నట్టల నివారణ మందు వేయనున్నట్టు పశుసంవర్ధకశాఖ జేడీ రమేష్ నాయక్ తెలిపారు. ఆయన గురువారం సైదాపురంలోని పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 31 వరకు నట్టల నివారణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. అలాగే మేలుజాతి పశువుల కోసం రాయితీపై మందులు అందజేస్తామన్నారు.

16న పల్లె పండుగలో అభివృద్ధి పనులకు శ్రీకారం

చిల్లకూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమాన్ని ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో గోపి గురువారం తెలిపారు. ఆయన గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలో రూ.2 కోట్లతో 41 పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ముందుగా ముత్యాలపాడు, తిక్కవరం, బల్లవోలు గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలకు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు.

తల్లిపై కత్తి దాడి

చిల్లకూరు : మండలంలోని కమ్మవారిపాళెంలో గురువారం రాత్రి తల్లిపై కొడుకు కత్తితో దాడి చేశాడు. పోలీసుల కథనం మేరకు.. దళితవాడకు చెందిన సురేష్, సుశీలమ్మ దంపతుల కొడుకు మనోజ్ ఇటీవల వరకు ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లడం లేదు. దీంతో తల్లిదండ్రులు మందలించారు. గురువారం రాత్రి భోజనం చేస్తున్న తల్లిపై మనోజ్ కత్తితో దాడి చేశాడు. ఆమె తలపై తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి చేరుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం

మేనకూరులో సెజ్ ఏర్పాటైంది. ఇక్కడ వందలాది పరిశ్రమలు నెలకొంటున్నాయి. అక్కడ పనిచేసే కార్మికులు నాయుడుపేటలో నివాసం ఉంటున్నారు. దీంతో నాయుడుపేటలో భూమల ధరలకు రెక్కలు వచ్చాయి. దీన్ని ఆసరాగా తీసుకున్న అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. వాటిని అక్రమార్కులు తొలగించి ఆక్రమించుకుంటున్నారు.

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- హెచ్చరిక బోర్డులు పెట్టి వదిలేస్తున్న అధికారులు



విన్నమాల సప్లయ్ చానల్ పక్కన ఆక్రమణకు గురైన మున్సిపాలిటీ స్థలం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణ నడిబొడ్డున రూ.లక్షల విలువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నా యి. వాటి చుట్టూ ఫెన్సింగ్ వేయలేదు. వాటిని కొంతమంది రాత్రికి రాత్రే ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే పాత బస్టాండు సమీపంలో ఇటీవల రేకుల షెడ్డు నిర్మించి దుకాణా లకు అద్దెకు ఇచ్చారు. అదేవిధంగా ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి పక్కనే సుమారు 50 అంకణాలకు పైగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్థానికులు ఆక్రమించుకుని పాత ఇనుప సామానుల అంగడికి బాడుగకు ఇచ్చారు. దీన్ని వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి మున్సిపల్ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తొలగించి ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ బోర్డు ఏర్పాటుచేయించారు. దాన్ని స్వాధీనం చేసుకుని పక్కాగా ఏర్పాట్లు చేయకపోవడంతో దానిపై మళ్లీ అక్రమార్కుల కన్ను పడింది. ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో రహదారి పక్కనే విన్నమాల సప్లయ్ చానల్ కు అనుకుని సుమారు 100 అంకణాలు ఉన్న స్థలాన్ని ఆక్రమించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల టీడీపీ నేతలు శ్రీకాళహస్తి బైపాసు రోడ్డు సమీపంలో లక్కిశెట్టిగుంట పోరంబోకు భూమిని ఆక్రమించుకుని ప్లాట్లు వేసి విక్రయించేందుకు ప్రయత్నించారు. ఇక్కడ సుమారు 60 సెంట్లకు పైగా స్థలం ఉంది. దాని విలువ రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్లకుపైగా ఉంది. అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు నాటిన రాళ్లను మున్సిపల్ అధికారులు తొలగించారు. తర్వాత పట్టించుకోలేదు. దాన్ని మళ్లీ ఆక్రమించుకునేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. అదే విధంగా అంబేడ్కర్ భవన్ సమీపంలో రహదారి పక్కనే ఉన్న స్థలాన్ని టీడీపీ నేత రాత్రి రాత్రే ఆక్రమించుకుని రేకుల షెడ్డు నిర్మించాడు. దీనిపై కథనం రావడంతో అధికారులు స్పందించి నిర్మాణాన్ని తొలగించారు. తర్వాత దాని గురించి పట్టించుకోలేదు.

నిరుపయోగంగా రూ.కోట్ల విలువైన స్థలాలు

పట్టణ నడబొడ్డున గడియారం సెంటర్ సమీపంలో మున్సిపాలిటీకి సంబంధించి గతంలో దుకాణాలతో పాటు పక్కనే ఉన్న బందిల దొడ్డి ఉండేది. అది శిథిలావస్థకు చేరుకోవడంతో తొలగించి స్థలాన్ని అలాగే వదిలేశారు. పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న పురాతన కారగాయల మార్కెట్‌ను తొలగించి ఆ స్థలాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారు. అదేవిధంగా సీఎస్ తేజ థియేటర్ సమీపంలో కోట్ల విలువైన స్థలం ఉంది. గతంలో దాన్ని కొంతమంది ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. వాటిని అధికారులు తొలగించి వదిలేశారు. అక్కడ దుకాణాల సముదాయం నిర్మించాలని ప్రతిపాదనలు చేసినా ముందుకు కదలలేదు. ఇంకా పలు చోట్ల ఉన్న ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. అధికారులు స్పందించి స్థలాలు ఆక్రమణకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం



నేను ఇక్కడికి ఈ మధ్యే బదిలీపై వచ్చాను. అన్ని విషయాలను తెలుసుకుంటాను. మున్సిపాలిటీకి సంబంధించిన విలువైన స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకుని ఆక్రమణకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతాం. స్థలాలను ఆక్రమించుకున్న వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదు.

– షేక్ ఫజులుల్లా, మున్సిపల్ కమిషనర్, నాయుడుపేట

మృతుల కుటుంబాలకు నేదురుమల్లి పరామర్శ



అల్లం సాయి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేదురుమల్లి



రమణారెడ్డిని పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం)/దక్కిలి/ రాపూరు : వెంకటగిరి పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత అల్లంసాయి తండ్రి ఈశ్వరయ్య, ఎన్‌జీవో కాలనీలోని కోటంరెడ్డి సుబ్బరామిరెడ్డి సతీమణితోపాటు డక్కిలి మండలం తీర్థంపాడులోని వైఎస్సార్‌సీపీ నాయకుడు పెట్లూరు రమణారెడ్డి సతీమణి సుజాతమ్మ, మండలంలోని రాపూరు మండలంలోని సైదాదుపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బొమ్మిరెడ్డి వెంకటరమణారెడ్డి తండ్రి శ్రీనివాసులురెడ్డి ఇటీవల మృతిచెందారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం వారి నివాసాలకు చేరుకుని మృతుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, కౌన్సిలర్ ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, కందాటి రాజారెడ్డి, దశరథరామిరెడ్డి, చింతల శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ డక్కిలి మండల కన్వీనర్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. రాపూరు జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, మైనార్టీ నాయకులు డాక్టర్ ఖాదర్‌బాషా, శంకరరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, సంజీవరెడ్డి, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

'నన్ను అన్యాయంగా తొలగించారు'

ఓజిలి: అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా తనను విధుల నుంచి తొలగించారని ఫీల్డ్ అసిస్టెంట్ పులికొండ శివరాజ ఆరోపించారు. ఆయన గురువారం వెంకటరెడ్డిపాళెంలో విలేకరులతో మాట్లాడారు. తాను 2022 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడినని చిత్రీకరించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని వాపోయారు. అధికార పార్టీ నేతలు, అధికారులు కుమ్మక్కై తాను అవినీతికి పాల్పడినట్టు సృష్టించారని విమర్శించారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

నాయుడుపేట టౌన్ : నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని స్థానిక వ్యవసాయ సంచాలకులు లక్ష్మీదేవి తెలిపారు. ఆమె గురువారం నాయుడుపేట డివిజన్‌లోని అన్ని మండలాలకు చెందిన వ్యవసాయ సిబ్బందికి పంట పొలాల సామర్థ్యం పెంపుపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శశిధర్ రెడ్డి కలుపు మందుల వాడకం తదితరాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త ప్రసాద్, ప్రాంతీయ సాంకేతిక సలహాదారులు రవిచంద్ర ప్రసాద్, నాయుడుపేట ఏడీఏ సుచేంద్ర ప్రసాద్, నాయుడుపేట, పెళ్లకూరు, చిట్టమూరు , వాకాడు, కోట మండలాల ఏవోలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతోనే పంచాయతీల అభివృద్ధి

సైదాపురం: సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేస్తేనే పంచాయతీ అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పక్కా ప్రణాళికను రూపొందించుకుని, దాని ప్రకారం పనులు చేపట్టాలన్నారు.

అందరూ కలిసి పనిచేయాలి

ఓజిలి: వార్డు సభ్యులు, ఉప సర్పంచులు పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రెండో రోజు గురువారమూ వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలు తదితర మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రవీంద్రబాబు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

బాలాయపల్లి (సైదాపురం) : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జయంపు గ్రామానికి మంజూరైన పీహెచ్‌సీలో వైద్యసేవలు అందించాలన్నారు. వాకాడు నుంచి జయంపు వరకు నడుస్తున్న ఆర్టీసీ బస్సును కోటంబేడు మీదగా నాయుడుపేటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో వినీల్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఈవోలు, ఉద్యాన సహాయకులకు శిక్షణ

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి సబ్‌డివిజలోని ఎంపీఈవోలు, ఉద్యాన సహాయకులకు గురువారం శిక్షణ ఇచ్చారు. వ్యవసాయశాఖ జిల్లా ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ భాస్కరయ్య మాట్లాడుతూ అంతర పంటలు, ఉద్యాన పంటలు సాగు చేసుకుంటే అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఏడీఏ నాగార్జునసాగర్, కేవీకే కోఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి, ప్రకృతి వ్యవసాయం ఎన్ఎస్ఏ ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అరటి మొక్కల పెంపకంతో లాభాలు

బాలాయపల్లి(సైదాపురం) : టిష్యుకల్చర్ అరటి సాగు ఎంతో లాభదాయమని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.శ్రీనువాసులు రెడ్డి తెలిపారు. మండలంలోని కోటంబేడు, జార్లపాడు గ్రామాల్లో గురువారం టిష్యుకల్చర్ అరటి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు కె.తిరుపాలు, రాజీవన తదితరులు పాల్గొన్నారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం

చిల్లకూరు: ఇంటి వద్ద నుంచి మాయమైన బాలుడు లాసిక్ కండలేరు క్రీక్‌లో విగత జీవిగా మారిన ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడతామని గూడూరురూరల్ సీఐ కిషోర్‌బాబు తెలిపారు. సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేష్ బాబు గురువారం వరగలిలో బాలుడి తల్లిదండ్రులు, గ్రామస్తులు, బాలుడి స్నేహితులను విచారించారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు రమేష్, సంధ్యతో మాట్లాడుతూ ఇంటి వద్ద ఎన్ని గంటల వరకు ఉన్నాడు.. అటు తరువాత ఎప్పటి నుంచి కనిపించకుండా పోయాడు.. చిత్తు కాగితాలు ఏరుకునే వారితో వెళ్లిన విషయం ఎవరు చెప్పారు.. వారు ఎక్కడ చూశారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బాలుడితో ఆడుకునే చిన్నారుల నుంచి పలు విషయాలను రాబట్టారు.

దుర్గాదేవిగా చెంగాళమ్మ పరమేశ్వరి




సూళ్లూరుపేట : దుర్గాదేవిగా చెంగాళమ్మ పరమేశ్వరి, నాయుడుపేట మూకాంబికాదేవి

సూళ్లూరుపేట/వాకాడు/చిట్టమూరు(వాకాడు)/ దక్కిలి/సైదాపురం /గూడూరు రూరల్/చిల్లకూరు/రాపూరు/నాయుడుపేట టౌన్ /వెంకటగిరి రూరల్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం చెంగాళమ్మ పరమేశ్వరి దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం ఆవరణలోని యాగశాలలో మహా చండీయాగం చేపట్టారు.

చెంగాళమ్మ పరమేశ్వరికి సారె సమర్పణ

చెంగాళమ్మ పరమేశ్వరికి గురువారం సాయంత్రం సూళ్లూరు, నాగరాజుపురం, వాటంబేడు రోడ్డు ప్రాంతాలకు చెందిన చెందిన భక్తులు సారె సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో చీరలు, రవికెలు, పండ్లు తీసుకుని ఆలయం వరకు ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. వారికి ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మీ స్వాగతం పలికారు.

- వాకాడు గ్రామ దేవత నాగార్పమ్మ గురువారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోటేశ్వరరావు గాజుల అలంకారం, కుంకుమ పూజ చేశారు.
- **చిట్టమూరు(వాకాడు):** మండలంలోని మల్లాం మార్కేండేశ్వర స్వామి ఆలయంలోని కామాక్షిదేవి అమ్మవారు గురువారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- డక్కిలి ప్రముఖ శైవక్షేత్రమైన దేవునివెల్లంపల్లిలో వెలసిన స్తంభాలగిరీశ్వరయ్య స్వామి ఆలయంలో అమ్మవారు పార్వతిదేవీ గురువారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మహాదుర్గగా బాలత్రిపురసుందరీదేవి..

- సైదాపురంలో వెలసిన బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారు గురువారం మహాదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ గురువారం దుర్గాదేవిగా బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు.
- గూడూరు పట్టణంలో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు గురువారం పార్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



బంగారు చీరలో దర్శనమిస్తున్న ముత్యాలమ్మ

- రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసిన ఆదిలక్ష్మీదేవి అమ్మవారు గురువారం విజయలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాపూరులోని కన్యకాపరమేశ్వరి దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేపినాపి సమీపంలోని అంకమ్మ, రాపూరు గ్రామదేవత రాపూరమ్మ దుర్గాదేవిగా అనుగ్రహించారు.
- నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ, మూకాంబికా దేవి అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి మహిషాసుర మర్ధినిగా, దుర్గామల్లేశ్వరి దేవి దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు.
- వెంకటగిరి పట్టణంలోని కర్ణమ్మవీధిలోని హరహర క్షేత్రంలోని కాత్యాయని అమ్మవారు దుర్గాదేవిగా, శ్రీ వెంకటేశ్వరస్వామి బలరామావతరంలో భక్తులకు దర్శన మిచ్చారు.



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు